


# పెద్దింటి పేరంటం

— ఎమ్. సుధాదేవి

కామేశ్వరి తన పనంతా ముగించుకుని స్కూలుకు వెళ్ళడానికి తలుపులన్నీ వేస్తోంది. పెనిమిటికీ, పిల్లలకీ టిఫిన్లు పెట్టి డబ్బాలు కట్టి వాళ్ళను పంపించింది. తన బ్యాగ్ డబ్బా సర్దుకుని కిటికీలు కూడా వేసే టైములో తలుపు కొట్టిన చప్పుడు. 'ఎవరబ్బా ! స్కూలుకు వెళ్ళే టైమవుతూంటే ఎవరు వస్తారు ? పని మనిషి పొద్దున్న అడ్వాన్స్ కావాలని అడిగింది. ఇప్పుడు పనిలో ఉన్నా తరువాత చూస్తాలే అని అన్నది తను. తరువాత అంటే ఇప్పుడా ?' ఎటూ తలుపు తీయక తప్పలేదు. తలుపు తెరవగానే ఎర్రంచు ఆకుపచ్చని కంచి పట్టు చీరె కట్టుకుని సర్వాలంకారాలతో మహాలక్ష్మిలా ఒకావిడ నిలబడి ఉంది. ఆమె ఎవరు ? తానెప్పుడూ చూడలేదే ? జగన్మాత తన ఎదుట ప్రత్యక్షమయినట్లుగా ఉంది. కామేశ్వరికి నోట మాట రాలేదు. తడబడుతూ 'లోపలికి రండి' అని పిలిచింది. లోపలికి రమ్మన్నది కానీ ఇంట్లో ఆమెను ఎక్కడ కూర్చోపెడుతుంది ?

వాళ్ళది ఒక్కటే గది. అదే లివింగ్ రూమ్. బెడ్ రూము...ఎవరయినా వస్తే డ్రాయింగ్ రూమ్ కూడా. అదికాక చిన్న వంటిల్లుంది. అందులోనే సామాను సర్దుకుని వండుకుని భోజనాలు చేసి సర్దుకోవాలి. అంతకన్నా ఎక్కువ అద్దె పెట్టే స్తోమత లేదు. తనకు పిల్లలకు స్కూలుకి దగ్గరగా ఉన్నదని అక్కడ ఉంటున్నారు. అంతకన్నా సౌకర్యం ఏం కావాలి ?

సరే ! ముత్తయిదువను ఎక్కడ కూర్చోపెట్టాలి ? మంచంమీద పరుపు చుట్టలు పేర్చి ఉన్నాయి. ఉన్న ఒకే ప్లాస్టిక్ కుర్చీ నిండా బట్టలున్నాయి... అవి తీసి అందులో కూర్చోబెట్టింది. ఆవిడ కుర్చీలో కూర్చుని గదంతా కలయజూసింది. "మీరూ ఆ పెట్టె మీద కూర్చోండి" అన్నది తాపీగా. కామేశ్వరికి చికాకు వేసింది. తను స్కూలుకి వెళ్ళే టైమవుతూంటే ఈ కూర్చోవటాలేమిటి ? తల యెత్తి ఆమె వంక చూస్తే ఏమీ అనలేకపోయింది.

ఆవిడే సంభాషణ మొదలుపెట్టింది. ఈ పక్కనున్న మేడ మాదే. మీరీ మధ్యనే ఇక్కడికి వచ్చినట్టున్నారు. నన్నెప్పుడూ చూసి ఉండరు. నేను ఇవాళ వరలక్ష్మీ వ్రతం చేసుకోవాలనుకుంటున్నాను. మా బంధువులను, మిత్రులను ఇవ్వాళ సాయంత్రం పేరంటానికి రమ్మని ఫోన్లు చేశాను. వ్రతం చేయించడానికి పూజారిని రమ్మన్నాను. ఇప్పటిదాకా రాలేదు. మీరు పూజలు బాగా చేస్తారని మీ పని మనిషి చెప్పింది. అందుకని మిమ్మల్ని పిలుచుకుని వెళదామని వచ్చాను."

కామేశ్వరికి అర్థం కాలేదు. "వాయనం తీసుకోవడానికి రమ్మంటారా ? నేను స్కూల్లో పని చేస్తున్నాను. ఇప్పటికే లేటయిపోయింది. కానీ పసుపు, కుంకుమ తీసుకోవడానికి మీరు పిలిచారు కాబట్టి తప్పకుండా వస్తాను" అంటూ బయలుదేరడానికి సిద్ధమయింది.

"అహా ! ఇలా కాదండి. పట్టు చీరె కట్టుకుని రావాలి."

కామేశ్వరికి ఒళ్ళు మండింది. ఇదేం జాలుం ? పట్టు చీరె కట్టుకోమనగానే దుఃఖమొచ్చింది. తనకున్నది ఒకే ఒక పట్టుచీరె. అది బాగా నలిగిపోయి మాడిపోయింది. ఉతికి పెట్టుకోవడానికి తనకు టైము లేదు. ఆమె అక్కడ కూర్చుండగానే పట్టులా కనపడే పాలిస్టరు చీరె, రవిక తీసుకుని వంటింట్లోకి వెళ్ళి కట్టుకుని వచ్చింది. ఆమె కూడా లేచింది ఇద్దరూ బయటికి వచ్చిన తరువాత ఇంటికి తాళం పెట్టింది.

రెండిళ్ళ అవతల ఉన్న మూడంతస్తుల బంగళా. కామేశ్వరి తన స్కూలు టైమ్ అయిపోయిందని కంగారుగా ఉంది. కానీ ఏం చెయ్యగలదు ? అయినా దేవీపూజ.

రెండతస్తుల మెట్లెక్కి ఒక హాలులోకి ప్రవేశించారు. పాతిక ముప్పయ్ మంది కూర్చోగల హాలు. తూర్పు ముఖంగా గోడవారగా అమ్మవారు అలంకరించబడి ఉంది. జరీ బుటాలతో ఉన్న బనారసు చీర గోడకు బ్యాక్‌గ్రాండ్‌గా అమర్చి ఉన్నది. ఒక పెద్ద వెండి బిందె మీద వెండి అష్టలక్ష్మి చెంబు. దాని మీద కలశం. ఈ అలంకారాలకు అడ్డులేకుండా అమ్మవారి చుట్టూ ఎర్రని పట్టు చీర చుట్టబడి ఉంది. అమ్మవారి మెడనిండా నగలు... కెంపుల పట్టెడ. ముత్యాలు పచ్చలు కలిపి గుచ్చిన దేరులు. ఎనిమిది వరుసల చంద్రహారం. అమ్మవారికి చేతులుగా అమర్చి కెంపులు ముత్యాలు కలిపి అల్లిన గాజులు.

అమ్మవారి వర్ణన కామేశ్వరి నోటికి వస్తోంది. "రత్న కంకణ కేయూరధారినీ, రత్న సానునివాణినీ...ఆహా ఈరోజు ప్రత్యక్షంగా చూసినట్లుంది కదా !"

అదిశక్తి రమేయాత్మా
పరమాపావనా కృతి:
అనేక కోటి బ్రహ్మాండ
జననీ దివ్య విగ్రహా
రత్న కింకిణి కారమ్యా
రశనా దామ భూషితా
మాణిక్య మకుటాకారా
జానుద్వయ విరాజితా
సర్వారుణ నవద్యాంగీ
సర్వారుణ భూషితా

ఆ దేవిని చూసి కామేశ్వరి తన్మయం చెందింది. దీపపు కుందులు సైజు వారీగా దజనుకు పైగా ఉన్నాయి. వొత్తులు కూడా తానే చేసుకోవలసి వచ్చింది. అగరువత్తులు రెండు మూడుచోట్ల బొత్తిపెట్టి ఉన్నాయి. దీపాలు కానీ అగరువొత్తులు కానీ వెలిగించిలేవు.

"పూజ ఇంకా కాలేదాండీ !" అంటూ అమాయకంగా ప్రశ్నించింది కామేశ్వరి.

"నాకు పూజ రాదండీ. ఎప్పుడూ వస్తువులు అమర్చి పెడతాను. పూజారిగారే చేయిస్తారు. ఈ మాటు అతను ఎందుకనో రాలేదు. అందుకనే మిమ్మల్ని పిలిచాను. మీ చేత్తో పూజ చేయించండి." అని దేవికి ఎదురుగా కామేశ్వరికి పీట వేసి కూర్చోబెట్టి తాను పక్కగా కూర్చుంది.

కామేశ్వరి స్కూలు సంగతి మరిచిపోయింది. భక్తిగా అమ్మవారి ఎదుట కూర్చుని గణపతి పూజతో ప్రారంభించి దేవిని ప్రతిష్ఠ చేసి పూజ యధావిధిగా చేసింది. దీపాలకు వొత్తులు, తోరణాలు తానే చేయవలసి వచ్చింది. దారపుండ, ఇన్ని పువ్వులు ఇచ్చి తోరణాలు తయారు చేయమంది. "ఇవన్నీ అయిన తరువాత అమ్మవారికి కొబ్బరికాయ కొట్టి నైవేద్యం పెట్టాలి కదండీ ?" అన్నది కామేశ్వరి. ఆమెకు ఇదయినా తెలుసునో లేదో అని.

ఆమె చెంగున లేచి 'వంట మనిషి బూరెలు వండుతున్నది తెస్తాను ఉండండి అని ఎన్ని తెమ్మంటారు ?' అని అడిగింది. 'అమ్మవారికి మూడు రకాల పిండివంటలు నైవేద్యం పెట్టి ముత్తయిదువకు పన్నెండు బూరెలు వాయినం ఇవ్వాలి' అని చెప్పి అమ్మవారిని ఆమె అలంకారాన్ని కళ్ళనిండా చూసుకుంటూ లక్ష్మీ సహస్ర నామాలను రాగయుక్తంగా చదివింది.

ఇంతలోకి ఇంటావిడ బూరెలు, పులిహోర, బజ్జీలు పళ్ళెంలో పెట్టి పట్టుకొచ్చింది. అమ్మవారికి నైవేద్యం పెట్టి కథ చెప్పుకున్నారు. పూజంతా అయిపోయింది. 'నేను వెళతానండీ' అంటూ కామేశ్వరి లేచింది. అప్పటికే ఒంటిగంట దాటింది. 'ఉండండి వాయనం ఇస్తాన'ని ఇంటావిడ ఒక పళ్ళెంలో పండు తాంబూలం-లెక్క పెట్టి పన్నెండు బూరెలు-నాలుగయిదు బజ్జీలు-నాలుగయిదు చెమ్చాల పులిహోర-ఒక చౌకబారు రవికల బట్ట-అయిదు రూపాయల బిళ్ళ-బొట్టు పెట్టి ఇచ్చి ఇవన్నీ పెట్టుకోవడానికి ఒక ప్లాస్టిక్ కవరు ఇచ్చింది. కామేశ్వరికి అవమానంగా తోచింది. 'వద్దండీ' అని అక్కడ పడేసి వచ్చేంత కోపం వచ్చింది. కానీ తనకు ఇచ్చింది ఆవిడ కాదు కదా-దేవి... ఆ అమ్మ ఏదిస్తే అది తీసుకోవాలి.

వంటింట్లో నుండి నేతి పిండి వంటల వాసన వస్తోంది. లడ్డూ మైసూరు పాక్ -మరింకేవేవో ? అక్కడికి ఉండబట్టలేక కామేశ్వరి అన్నది "మహా నైవేద్యం పెట్టాలి కదండీ. నేను పెట్టి వెళ్ళనా ?"

ఇంటావిడ తెలివిగా సమాధానం ఇచ్చింది. "ఇంకా వంట పూర్తి కాలేదండీ. చాలా టైమ్ పడుతుంది. నేను పెట్టేస్తాను లెండి."

మరి తనను వెళ్ళమనేగా ? కామేశ్వరి ఆమె వైపు చూడకుండా అమ్మవారికి సాష్టాంగ నమస్కారం చేసి ఆ రూపును మనసునిండా నింపుకుని ఇంటికి వెళ్ళింది.

సాయంత్రం భర్త, పిల్లలు ఇంటికి వచ్చేసరికి ఉప్మా ఫలహారం చేసింది. అందులోకి రెండు రెండు బూరెలు పెట్టింది. శివశంకర్ తాపీగా కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటూ తింటున్నారు. బూరెలు చూశాక "ఏమిటోయ్ ఇవ్వాళ కూడా పూజ చేసుకున్నావా?" అని అడిగారు.

"ఆఁ... నేను పూజ చేసుకున్నాను. మనంట్లో కాదు. పక్కింటావిడ వచ్చి వాళ్ళింటికి పిలుచుకుని వెళ్ళింది. పూజ వాళ్ళింట్లో చేశాను."

"ఎవరింట్లో అయితేనేం ? పూజ చేయడం ముఖ్యం కదా ? బూరెలు కాక మరింకేమయినా ఉన్నాయా ?" అని అడిగాడు. నాలుగు బజ్జీలు గుప్పెడు పులిహోర పిల్లలు తినేశారు.. అయనకు ఏమీ లేవని చెప్పలేక పళ్ళెం లోపలికి తీసుకుని వెళ్ళిపోయింది.



కామేశ్వరి ఆ రోజు వంట తొందరగా చేసింది. పక్కింటావిడ పేరంటానికి పిలుస్తుందేమో అని సిద్ధంగా ఉంది.

ఏడు-ఏడున్నర దాకా చూసింది. పిలుపు లేదు. తాను వచ్చి పిలువనక్కరలేదు. పని మనిషి చేత కబురు చేసినా బొట్టూ తాంబూలం తీసుకొమ్మని అంటే తను వెళ్ళేదే ? ఉండబట్టలేక బయటికి వచ్చి చూసింది. వాళ్ళ ఇంటి ముందర ఆటోలు, కార్లు చాలా నిలబడి ఉన్నాయి పక్కింటావిడ తన స్నేహితురాలితో కిందకు దిగి వచ్చింది. ఆవిడ కారులో కూర్చుంటూ బై చెబుతోంది. ఒక పెద్ద ప్లాస్టిక్ కవరు నిండా ఫలహారాలు ఉన్నాయి. కామేశ్వరిని చూపిస్తూ ఏదో ఆవిడతో చెబుతోంది. ఆ పెద్ద కారు తన ఇంటిముందు నుంచీ వెళ్ళిపోయింది. అప్పటికయినా పక్కింటావిడ తనని పిలుస్తుందేమోనని ఎదురు చూసింది. తనను చూసి కూడా ఏమీ పనిలేనట్లు లోపలికి వెళ్ళిపోయింది.

కామేశ్వరికి కసి పుట్టుకొచ్చింది. తనకు ఒక రోజు సెలవు పోయింది. వాళ్ళింటికి వెళ్ళి పూజ చేయించింది. ఐశ్వర్యం రాసులు పోసుకున్నది. తనకు వాయనంలో పిండి వంటలు ఇవ్వలేకపోయిందా ? తను తినడానికి కాదు. ఇంట్లో పిల్లలకు పెట్టుకోదా ? చౌకబారు రవిక బట్ట అయిదు రూపాయలు ముష్టి పడేసినట్లు పడేసింది ? ఏమిటో సంస్కారం ? పూజలు చేసి నోములు నోచి-సాటి మనిషికి గౌరవమివ్వడం తెలియదా ?

అన్యమనస్కంగా పిల్లలకు అన్నాలు పెట్టి హోమ్‌వర్కులు చేసుకుని పడుకోమంది. తామిద్దరూ పెట్టుకుని తింటున్నా కామేశ్వరి ఒక్క మాట మాట్లాడలేదు.

రాత్రి పిల్లలు నిద్రపోయారనుకున్న తరువాత కామేశ్వరి శంకరం కౌగిట్లోకి చేరి వెక్కి వెక్కి ఏడ్చింది. ఆయన ప్రేమగా పొదివి పట్టుకుని "కామూ ! నీ కేమయింది ? ఇంత ఏడుపెందుకు ?" అని అనునయించగానే సగం దుఃఖం పోయింది. ఆ రోజు పొద్దున్నుంచి జరిగినదంతా చెప్పి "ఆవిడ ఎంత గొప్ప దయితే మాత్రం నన్నంత హీనంగా చూస్తుందా ? చీరెలూ, నగలూ ఉంటే నోటితో ఒక్క నామం పలకడం రాదు. ఏం చూసుకుని అంత అహంకారం ?" అంది.

"కామూ ! ఆవిడ అహంకారం నిన్నేం చేసింది ? అమ్మవారు స్వయంగా నీ ఇంటి కొచ్చి పిలిచి నీ చేత పూజ చేయించుకున్నది. సర్వాలంకార భూషిత అయి నీకు సాక్షాత్కరించింది. ఆ దేవి ఎదురుగా కూర్చుని నీవు పూజ చేశావు కదా ! వస్తువులు ఎవరివయితేనేమి ? అనుభవం అనుభూతి నీదేకదా ! ఇంతకంటే నీకేం కావాలి ?"

"పిండివంటలు ఏవో చేస్తుంది కదా ! నాకు కూడా ఇస్తే పిల్లలకు పెట్టే దాన్ని కదా?"

"కామూ ! మనం తినగలిగేది తిందాం. పిల్లలకు పెట్టగలిగేది పెడదాం. అంతేకానీ ఒకరింటిది మన కొద్దు. పిండివంటలు పిల్లలకు పెట్టాలని వుంటే నీవు చేసిపెట్టు లేకపోతే కొనిపెట్టు." అన్నాడు.

కామేశ్వరికి కోపం తగ్గలేదు. "ఆమె ఇంకొకసారి కనపడితే నేను చచ్చినా మాట్లాడను. పిలిచినా వెళ్ళను."

"నువ్వు ఆమె పిలిస్తే వెళతావు. తప్పకుండా మాట్లాడుతావు. తన పనికూడా చేసిపెడతావు."

"నేనేమంత సిగ్గులేని దాన్ననుకున్నారా? ఆవిడ ఐశ్వర్యం ఆవిడ గొప్ప నాకేం లెక్క లేదు." అంది.

"ఆవిడదే కాదు. ఎవరిదయినా ఐశ్వర్యంలో ఉన్న ఆకర్షణే అటువంటిది. భగవంతుడు సృష్టించిన సౌందర్యంలో ఉన్న అయస్కాంతం. నీవు ఆమె వైపు చూడకుండా ఉండలేవు. అది ప్రకృతి సహజం."

"ఏమిటో ? మీరు ఆమెను వెనకేసుకొస్తారేమిటి ?" కామేశ్వరి మనసు మరింత కుతకుతలాడిపోయింది. మరింత కసి పుట్టుకొచ్చింది. కాసేపయ్యాక కామేశ్వరికి అసలు సంగతి తెలిసొచ్చింది. తనను ఆమె పూజ కోసమే వాడుకుందని. తాను కూడా తనకు తెలియకుండానే ఏవేవో ఆశించిందని. సిగ్గుతో కుచించుకుపోయింది. ఇంకెప్పుడూ ఇలా చేయకూడదని తీర్మానించుకుని నిద్రలోకి జారిపోయింది.